# గాలివాన

తాడినేని వెంకటనరసింహారావు

అనూరాధ విసుగ్గా రేడియో ఆఫ్ చేసింది. ఇరవైనాలుగ్గంటలూ యిదే [illegible] [illegible] సినిమాల్లో! పత్రి [illegible] [illegible] చూసినా యిదే చర్చ. సంతాన నిరోధం.

అనూరాధ బాధగా నిట్టూర్చింది. చిత్రవిచిత్రమయిన ఈ ప్రకృతిని ఎనలైజ్ చేస్తుంది.

అజీర్తితో బాధపడేవాళ్లొకవైపు. ఆకలితో అలమటించే వాళ్లు మరొకవైపు. అతివృష్టి వొకవైపు. అనావృష్టి మరోవైపు.

వొద్దు మొర్రో అనుకునే వాళ్ళకు గంపెడు పిల్లలు. కావాలని తపించిపోయేవారికి పిల్లలుండరు.

అడుక్కునేవాడికి వానమునుడు.

అనూరాధకు పెళ్ళయి పదిసంవత్సరాలయినా యింతవరకూ సంతానంలేదు. తన వయసువాళ్ళు, ముగ్గురేసి, నలుగురేసి పిల్లల్ని కని కూర్చున్నారు. అదే అనూరాధ బాధ.

పెళ్ళయిన నాలుగైదు సంవత్సరాలు పిల్లలు కలక్కపోవడం బాగానేవుండేది అనూరాధకు. ఆ యదృష్టానికి అనూరాధ తోటివాళ్ళు అసూయపడటంకూడా కద్దు. కాని పరిస్థితి తారుమారయింది. ఇతరుల పిల్లల్ని చూసి అసూయపడటం అనూరాధవంతయింది. అసలు పిల్లలు కలక్కపోవడం అనూరాధకే చిన్నతనం అనిపిస్తోంది. నలుగురిలో ఏదో అపరాధిలా ఫీలవుతోంది. తన స్త్రీత్వానికే కళంకం అని బాధపడుతుంది.

ఏ సమయంలో జరగవలసిన క్రియ ఆసమయంలో జరిగితేనే అందం, ఆనందమూనూ. ప్రకృతి నియమంకూడా అదే. ఆడపిల్ల— ఎంత చదువుకున్నదయినా సరే పెళ్ళిచేసుకోవడం అందం. పెళ్ళయిన మూడు నాలుగేళ్ళు మొగుడితో పైలా పచ్చీసుగా తిరగడమూ ఆనందమే. తరువాత?

ఆడది పిల్లల్ని కనితీరాలి.

పెళ్ళికాకుండా పిల్లల్నికన్నా, పెళ్ళయాక పిల్లల్ని కనకపోయినా, అమ్మమ్మల వయసులో పిల్లల్నికన్నా అసహజంగా వుంటుంది.

లోకులు కాకులు.

కాకులు అరవడం సహజం.

లోకులు నవ్వడం సహజం.

నిరుత్సాహపు సముద్రంలో మునిగిపోతున్న అనూరాధకు ఒక అరటిపిలక లైఫ్ బోటయి కూర్చుంది. అంతేకాదు. మండుటెండలో దప్పికగొన్న బాటసారికి ఏ మురికినీటితోనైనా గొంతు తడుపుకోవాలనుకునే సమయంలో చల్లటినీటితో లాబేటికాయ దొరికినట్లయింది.

ఇంత చిన్న సంఘటన అనూరాధ జీవితగమనాన్నే మార్చివేసింది.

ఎన్నడూ పెరటితోటపై ఆసక్తి చూపనిభర్త ఒకరోజున హఠాత్తుగా అరటి మొక్కతో ప్రత్యక్షం కావడంతో అనూరాధ ఆశ్చర్యాంబుధిలో మునిగిపోయింది. యింకా తేరుకోకమునుపే భర్త మాధవరావు 'చాలమంచి జాతి అనూ! భుసావల్ నుండి తెప్పించారు హారప్‌వాళ్ళు. పది నెలల్లో గెల దిగవలసిందే. ఈ రకంపళ్ళ వల్ల మనదేశానికి ఎంతో విదేశమారక ద్రవ్యం వస్తోందట...' ఇంత వుత్సాహంతో చెప్పుకుపోతున్న భర్తను నిరుత్సాహపరచడం యిష్టంలేక అనూరాధ మొక్కను చేతిలోకి తీసుకుంది. పసిపిల్లను నిమిరినట్లు నిమిరి ఆప్యాయంగా 'అబ్బ! బాగుంది సుమండీ! లక్షణం చూస్తే పదినెల్లెందుకు పదిరోజుల్లోనే పళ్ళు తినిపించేట్టుంది' అంది అనూరాధ.

వ్యవసాయశాఖ వారి సలహాప్రకారం రెండడుగుల చవుకం రెండడుగుల లోతూ గొయ్యి తవ్వారు దంపతులిద్దరూ కలిసి.

'మంచి పాటిమన్ను కావాలి. ఎక్కడ దొరుకుతుంది చెప్మా?' మాధవరావు.

'మీది ఛాదస్తం మరీనూ' అంది అనూరాధ నవ్వుతూ.

'అహఁ! అలాగనకు. భూమి మంచిదయితేనే కాయలు కాస్తవి. చవిటినేలలో పంటలు పండవు' అంటూ మంచి మన్ను కోసం అన్వేషణ సాగించాడు.

అనూరాధ గతుక్కుమంది. భర్త యదాలాపంగా అన్నా అనూరాధ గాయపడింది. తనని వుద్దేశించి అన్నమాటలు కావని తెలిసికూడా, మనసు సంబాళించుకోలేకపోయింది,

'నేల మంచిదయుండి కూడా విత్తనం మంచిది కాకపోతే?' ప్రశ్నించుకుంది. తనే సమాధానం చెప్పుకుంది. 'అప్పుడూ పంట పండదు.'

దంపతుల మధ్య ఈ మూగ సంఘర్షణ కొద్ది సంవత్సరాలుగా జరుగుతోంది.

ఆ రాత్రే అనూరాధకు తియ్యటి కలొచ్చింది. మరపురాని కల. తన జీవితం చిగురింప జేసిన కల.

కలలో అరటిచెట్టు మాంచి బలమైన గెలవేసింది. పళ్ళు పచ్చగా నవనవ లాడుతూ వున్నయ్. పండిన పళ్ళను తాను స్వయంగా కోసితింది. పళ్ళు తియ్యగా అమృతం తలపిసట్లున్నవి.

'ఇంకేం! కంఠం[illegible]డన్నమాట.'

'ఇహ దిగులుపడొద్దు అనూ. నీ కడుపు తప్పక పండుతుంది.'

'సంవత్సరం తిరక్కుండా చూడు ఏమవుతుందో?'

అమ్మలక్కల వ్యాఖ్యానాలు మధుర సంగీతంలా వినిపించినవి అనూరాధ చెవులకు. యింకా వినాలి. తాను నలుగురికీ ఈ సంగతి చెప్పాలి. వాళ్ళ అభిప్రాయాలు వినాలి. అప్పటికిగాని తనకు తృప్తి కలుగదు. కాని అనూరాధ ఈ మధ్య బయటికి వెళ్ళడం మానుకుంది. ఎవరిళ్ళకూ వెళ్ళడంలేదు. ఆఖరికి రామాలయానికి పురాణ కాలక్షేపానికికూడా వెళ్ళడం మానుకుంది. ఇదంతా అనూరాధ తనకు తాను విధించుకున్న శిక్ష. రామాలయంవద్ద జరిగిన సంఘటన గుర్తొచ్చింది:

శాస్త్రులుగారు పురాణం హుషారుగా చెప్పుకు పోతున్నాడు. శృంగారం చెప్పాలంటే శాస్త్రులుగారికి పోటీలేదు. అయినా కాయనే సాటి. హనుమంతుని పుట్టుక ఘట్టం రసవత్తరంగా సాగుతోంది. స్త్రీలంతా శ్రద్ధగా వింటున్నారు.

'అంజనాదేవి వానరి అయినప్పటికీ సర్వాంగసుందరి. చిత్తమువచ్చిన రూపము ధరిస్తుండేది. ఒకనాడామె మానవాంగన రూపం ధరించి, రూపయౌవనశాలిగా తేజరిల్లుతూ, నానావిధాభరణాలు పెట్టుకుని, రంగు రంగుల పూలదండలు వేసుకుని, మహార్ఘమయిన పట్టుచీరధరించి ఒక పర్వతముమీద విహరించ సాగింది. ఆ దారినే వెడుతున్న వాయుదేవుడామె సౌందర్యానికి ముగ్ధుడై, మన్మథావేశ పరవశుడై, విచక్షణా జ్ఞానాన్ని కోల్పోయి బలవంతంగా ఆమెను తన పొడుగాటి రెండు చేతులా కౌగలించుకున్నాడు. అంజనాదేవి కలవరపడిపోయి 'ఎవడా ధూర్తుడు?' అని గర్జించింది. అంతట వాయుదేవు 'ఓ మగువా! భయపడకుము. నేను వాయుదేవుడను. నీ సర్వాంగశోభ చూసి మోహితుడనైనాను. నీకు నా వల్ల మహాబుద్ధిమంతుడూ, అమిత పరాక్రమవంతుడూ అయిన పుత్రుడు పుడతాడు!' అంజనాదేవి సంతుష్టురాలయింది.' అని హనుమంతుని పుట్టుక ముగిస్తూ శాస్త్రులుగారు

### గమనిక

ఉత్తరాల శీర్షికకి రాసేవారు ఈ క్రింది నియమాలు పాటించాలని మనవి: 1. ఉత్తరాలు వీలయినంత చిన్నవిగా ఉండాలి 2. రాసేవారి పూర్తి పేరు, చిరునామా ఇవ్వాలి 3. ఇంగ్లీషు లిపిలో అక్షరాలు రాయరాదు 4. కాగితానికి ఒకవయిపునవే రాయాలి. 5. సిరాతోనే రాయాలి. — సం॥


రు. 2790/- వరకు

సంపాదించండి.

మా కో-ఆపరేటివ్ స్కీము ద్వారా 3 నెలలలోగా సంపాదించండి. వివరములకు మరియు మీ పాలసికి వ్రాయండి.

M. M. C. SCHEME (WAPM)
5A. Ansari Road, Delhi-6.

తెల్లమచ్చలు

మా మందు వాడడం ప్రారంభించిన మూడవ నాటికే మచ్చలు యే రూపంలోవున్నా రంగుమారి, అటుపై స్వాభావికమైన రంగు పొందగలరు. ప్రచారంకొఱకు ఒక సీసా ఉచితముగా పొందుము. వెంటనే వ్రాయండి.

TAJ PHARMACY
P. O. KATRISARAI (GAYA)

తెల్ల వెంట్రుకలుండవు

సాగదడం మాకు ఇష్టంలేదు. "Palitari" ఆయుర్వేదిక్ సెంటెడ్ ఆయిల్ తెల్ల వెంట్రుకలను నల్లగా మార్చును. మొదట తెల్లవానిని నల్లవిగామార్చి, అటుపైన నల్లని వెంట్రుకలే వచ్చును. ఈ ఆయిల్ జ్ఞాపకశక్తి, కంటిచూపువృద్ధిపరచును. లాభంపొందినవారు 1000 పైగా మాకు వ్రాసియున్నారు. లాభం లేకున్న డబ్బు వాపసు. ధర రూ. 10/-

Sri Krishna Chandra Vaidya
(APH) P.O. Katrisarai (Gaya)


# గాలివాన

విధంగా వ్యాఖ్యానించారు:

'సంతానం కోసం వ్యభిచరించడం తప్పు కాదు. పురాణాల్లో అనేక దాఖలాలు చూపెట్ట గలను.'

శాస్త్రులు ఏ దురుద్దేశంతో ఈ వ్యాఖ్యానం చేస్తున్నాడో అనూరాధకు తెలుసు. తత్వచింతన కోసం వెళ్ళిన తను యిలాంటి వికారపు మాటలు వినవలసి వస్తుందని అనూరాధకు తెలీదు ఇందరి ఆడవాళ్లలో యింత బాహాటంగా శృంగారం చిత్రించడం రోత పుట్టింది.

ఆనాడు వొట్టు పెట్టుకుంది పురాణం ఛాయలకు వెళ్లనని.

అనూరాధ పురాణం వైపుకు వెళ్లడం కట్టడి చేసుకో గలిగింది గాని హనుమంతుని పుట్టుక ఘట్టం ఆమెలో అలజడి లేవదీసింది. ఎంత మరచిపోదామన్నా ఆ సంఘటననే గుర్తుకొస్తోంది. మనసులో ఏదో చెప్పలేని అశాంతి. ఆందోళన. చిరాకు. ఈ ఒక్క విషయం చాలదన్నట్లు మరో ప్రమాదకరమైన భావన. ఎదురింటి సుందరమ్మ మొగుడు పదేపదే తలపుకొస్తున్నాడు సుందరమ్మ మొగుడు తన భర్త కన్నా ఎన్నో రెట్లు యోగ్యుడుగా కనిపించడం మొదలెట్టాడు. ముగ్గురు పిల్లల్ని కన్నాడు (సుందరమ్మ కనలేదు.) ఎప్పుడూ హుషారుగా నవ్వుతూ వుంటాడు. పెళ్లాన్ని ఎంత ప్రేమతో చూసుకుంటాడని? ముద్దు ముద్దుగా ఎన్ని పేర్లతో పిలుస్తాడు? భార్యని. తన భర్తకిలాటివేమీ తెలియవు. అనూరాధకు భర్తమీద ఈసడింపు కలిగింది.

హనుమంతుని పుట్టుక, సుందరమ్మ మొగుడు పదేపదే గుర్తుకు రావడం, తన భర్తమీద గౌరవం సన్నగిల్లి పోతూ వుండటం— ఈ లింకుకి అర్థం ఏమిటి? అనూరాధ ప్రశ్నించుకుంది.

'మానసిక వ్యభిచారం' అనూరాధ నొప్పుకుంది.

ఈ సుడిగుండం నుండి తప్పించుకునేందుకు అనూరాధ శాయశక్తులా ప్రయత్నించింది. అయినా ఈ పాడు ఆలోచనలు వెంటాడుతూనే వున్నాయ్. అనూరాధకు తన మీద తనకు నమ్మకం పోతోంది. ఆత్మవిశ్వాసం సన్నగిలింది. చివరికి భగవంతుడి మీద భారం వేసింది. 'భగవంతుడా! నన్ను రక్షించు. ఏ పాపపు పనీచెయ్యకుండావుండే శక్తిని ప్రసాదించు. పున్నామ నరకానికిపోతే పోతాను. కాని ఈ నరకం నేను భరించలేను. పిల్లలు కలక్కపోతేపోయారు. నేను అవినీతికి పాల్పడలేను. నన్ను కడతేర్చు స్వామీ' ఔచిత్యం నశించకముందే అనూరాధ తేరుకుంది.

ఈ హాలాహలంలో కొద్దిపాటి పాషాణం చిలికినా చివరకి అమృతమే లభించింది అనూరాధకు.

భర్త అరటిమొక్క తేవడం, ఆరాత్రి తన కొచ్చినకలా, అమ్మలక్కల ప్రోత్సాహం, ఈ సంఘటనలన్నీ అనూరాధలోని పిరికితనంపోయి తనమీద తనకు నమ్మకం చేకూర్చినవి. విరుద్ధశక్తుల్ని పోరాడే ధైర్యంవచ్చింది.

మనిషికి ఒక విషయంమీద ధ్యేయం వుండాలి. దాన్ని సాధించడానికి దీక్ష వుండాలి. అప్పుడు కర్తవ్యం తప్పక నెరవేరుతుంది. అనూరాధ ధ్యేయం సంతానం. దీక్షకు లోపంలేదు. ఆశయం సిద్ధించగలదని అనూరాధ నమ్మకం. ఈ నమ్మకం ఎలాగొచ్చిందో, ఏ గ్యారంటీతో అంత ఖచ్చితంగా నమ్మతోందో అనూరాధకే తెలీదు. అంత నమ్మకంలోనూ ఒక్కొసిసరు అపనమ్మకంకూడా ధైర్యంగా యిముడ్చు కోగలిగింది అనూరాధ.

ఆ అపనమ్మకమే నిజమయితే?

'నేను బ్రతికించను' తీర్మానించుకుంది అనూరాధ.

* * *

అనూరాధ పూర్తిగా మారిపోయిందని యిరుగుపొరుగువారి నమ్మకం. ఇదివరలో వయసు మళ్లిన ముత్తయిదువులావుండేది. ఇప్పుడు అందంగా అలంకరించుకోవడం ఆనందంగావుండటం జరుగుతోంది. వయసులో పదేళ్లు చిన్నదయిపోయినట్లు కనబడుతోంది. అంత వుత్సాహంగానూ వుంటోంది. భర్తకి పరిణామం అర్థం కాకపోయినా యీ మార్పు ఎందుకో భయంవేసింది. పదిసంవత్సరాల కాపురం తరువాత అనూరాధ యిప్పుడు క్రొత్తగా కనిపిస్తోంది. అనూరాధ ధోరణిచూస్తే 'జీవితం బుద్బుదప్రాయం. ఈక్షణకాలంలో

హాయిగా కులాసాగా కాలక్షేపంచేస్తే చాలని అన్పిస్తూంటోంది.

ఇదివరకెన్నడూ నోరుతెరిచి భర్తను ఫలానాదికావాలని అడిగెరగదు. ఇప్పుడు ప్రతీదీ డిమాండ్‌చేస్తోంది. సినిమాలకనీ, షికార్లకనీ భర్తను వూపిరాడనివ్వడం లేదు. ఇదివర్లో భర్తంటే భయం.

ఇప్పుడు ఫ్రీగా స్నేహితునితో మాట్లాడినట్లు మాట్లాడేస్తోంది. అరటిచెట్టు పోషణ అనూరాధ దినచర్య.

సుందరమ్మ మొగుడు అసలు గుర్తుకు రావడంలేదు సరిగదా కనబడ్డా బజార్లో కనబడే వందలమంది మగాళ్లలో ఒకడు. చివరికి లెఖ్ఖ. హనుమంతుని పుట్టుక సంగతి ఎప్పుడన్నా గుర్తుకొచ్చినా భర్తను ఆట పట్టించడానికే పనికొస్తోంది.

పురాణం శాస్త్రులు అనూరాధ యింటికి రావడం జరిగింది.

'రండి శాస్త్రులుగారూ...కూర్చోండి.'

'ఏవిటమ్మాయ్ పురాణానికి రావడమే మానేశావు ?'

'అబ్బ, తీరకుండడం లేదండీ శాస్త్రిగారూ' అనూరాధ నవ్వుతూ.

'నీకు తీరిక లేకపోవడమేమిటి ? పిల్లా పీచూ ఎలాగూలేరాయె ?'

'అందుకే అసలు తీరడంలేదు.' ఈ తర్కం శాస్త్రులుకి అర్థం కాలేదు.

ఇంకా ఏదో చిలిపిప్రసంగం చేయా లనుకున్న శాస్త్రులుకి అనూరాధ గంభీర వదనం జంకు పుట్టించింది.

'సరేగాని శాస్త్రులుగారూ! అంజన కదేం రోగమండీ ?'

'ఏ అంజనా ?'

'అదేనండీ మీ అంజనే హనుమంతుని తల్లి. మొగుడుండగా ఏమిటి చెప్పండి ఆ పాడుపని ?'

'అమ్మమ్మ...అలా అనగూడదు. అది దైవకార్యం సుమా. హనుమంతుడిలాటి బలవంతుడు పుట్టాలి. మామూలు మార్గంలో అది సంభవమా ? తప్పెన్న డానికి మన మెంతటివాళ్లం ?' శాస్త్రులు నసుగుతూ సమాధానం చెప్పాడు. అప్పటి కిటే శాస్త్రులుకి అర్థంగానిది అనూరాధ వాగ్ధోరణి. విరగబడి మాట్లాడేస్తోం దేమిటి చెప్మా?' అని.

'పోనిద్దురూ! వెధవపురాణాలు. అంతా బూతులు' అనూరాధ

'అది సరేగాని నవరాత్రి దగ్గరవు తోంది. ఎవ్వరూ పలకడంలేదు. ఈ సంవత్సరం వుత్సవాలెలా జరుగుతాయో అంతు చిక్కడంలేదు. నీలాటి పడుచువాళ్లు తప్పుకు తిరుగుతోంటే యిహవన్నెలా జరుగుతాయి ?' పద్యం చదివినట్లు చదివి చక్కా పోయాడు శాస్త్రులు.

'దురాత్ముడు' అనుకుంది అనూరాధ కసిగా.

అరటిచెట్టు ఏపుగా పెరుగుతోంది. పసుపు పిల్లలా పెటపెట లాడుతూ తొలి సారి గర్భిణీస్త్రీలా హుందాగా, గర్వంగా విస్తరిస్తోంది. ద్వారపాలకుల్లా రెండు వైపులా రెండు పిలకలు తలెత్తినయ్. అనూరాధ పిచ్చిగా అనురాగం పెంచుకుంది ఆత్మీయులని చెప్పుకోడానికి బోలెడుమంది



న్నారు. ఒక్కరూ తనకు కావలసిన మనః శ్శాంతి, ధైర్యం యివ్వలేక పోయారు. చివరకు నోరులేని అరటిచెట్టు ఆత్మీయురాలైంది. దాపరికతనం లేకుండా నిర్మలంగా అరటిచెట్టుతో మాట్లాడేస్తుంది.

'త్వరగా గెలెయ్యవే!'

సరే నన్నట్లు తలూపింది అరటి.

'తలూపడం బాగా తెలుసు. నీకేమాత్రం తొందరలేదు' నిష్ఠూరంగా గాలి రివ్వున వీచడంతో ఒక ఆకు అనూ ఎదురొమ్మును తాకి గిలిగింతలు పెట్టింది. మరో ఆకు అనూ చెంపను మెత్తగా ముద్దుపెట్టుకుంది. అనూరాధ సిగ్గుతో పైట సర్దుకుంది. ఒళ్ళు పులకరించి నట్లయింది. తియ్యటి కోరికలు విజృంభించగా మందగమనంతో యింటిలోపలికి వెళ్ళింది.

రాత్రి భర్తతో 'ఏమండీ! అరటి చెట్టుకు దిష్టిబొమ్మ పెడదామా?' అనూరాధ అంది.

'ఎందుకూ? నీ పిచ్చిగానీ'

'ఎందుకేమిటి దిష్టి తగలకుండా. ఒక్కొక్కరి కళ్ళు పాపిష్టివి.'

'పిచ్చిదానా! ఎదిగినచెట్టు కాయకాసుతుందా? కడుపుతో వున్నమ్మ కనక మానుతుందా?' ఈ సామ్యం అనూరాధకు నచ్చలేదు.

'అదేమిటండీ గొడ్డుమోతు చెట్టుంకొచ్చుగా?' ఈ మాట అనూరాధ ఎలా అందో అనూరాధకే తెలీదు. అనేసింది.

# గాలివాన

అంతే. అరటిచెట్లలో గొడ్డుమోతువి, మగవి వుంటవేమో మాధవరావుకి తెలియదు.

'పోనిద్దూ! ఏం కొంప మునిగిపోతుంది గనుక?' నిద్ర కుపక్రమించాడు.

అనూరాధకు కునుకు పట్టలేదు. ఈ అభిప్రాయం తనకెలా కలిగింది? కాబోయే నిజాన్ని తన నోటివెంట యిలా పల్కరించ లేదుగదా? అయితే తన ఆశలు? తన కడుపు పండదా? కలే నిజం కాకపోతే దాని వ్యాఖ్యానం .నిజమెలా గవుతుంది?

'దేనికయినా ప్రాప్తం వుండాలి.' నిర్లిప్తంగా అనుకుంది అనూరాధ.

రోజులు భారంగా గడుస్తున్నవి. అరటి చెట్టు వంక జాలిగా చూడటం కన్నా చేసేదేముంది గనుక? తన చేతుల్లో ఏముంది గనుక?

'ఇహనేం? త్వరలోనే గెలేస్తుందమ్మోయ్?' పక్కింటి పద్మావతి చల్లటి కబురు చెప్పింది.

'ఎలా తెలుసు?'

'అదే పొట్టకు కనబడ్డంలా?

పద్మావతికి అరటిచెట్ల సంగతి బాగా తెలుసు. పొట్టకు వేసిన కొద్దిరోజులకు పువ్వు తప్పక బైటపడుతుందని చెప్పింది.

అవిడ చెప్పింది నిజమయింది. పువ్వు పూసింది. మరికొద్ది రోజులకే గెల బైట పడింది. అనూరాధ ఆనందం ఎక్కువంత సంతోష పడింది. పొరుగు వాళ్ళందరికీ చెప్పింది. వాళ్ళెవరికీ ఈ విషయం అంత ప్రాముఖ్యమయిందిగా కనిపించ లేదు. 'అలాగా' అని వూరుకోలేదు కూడాను.

'అనూరాధకేమైనా పిచ్చా?' అను కున్నారు. అయితేనేం రోజులు సరదాగా గడుస్తున్నవి. అనూరాధ అరటిచెట్టు మీద ప్రత్యేక శ్రద్ధ తీసుకొంటోంది. బాలెంత రాలుకు చేసినంత అట్టహాసం చేస్తోంది.

గెల పెద్దదయింది ఇంకా వారం పది రోజుల్లో పళ్ళు తయారుకావొచ్చు. పళ్ళు నవనవలాడుతున్నవి. గెల బరువుకి చెట్టు వొంగిపోయింది. పద్మావతి సలహా మీద గెలకు పోటీ పెట్టింది. ఇహ తన కోరిక తీరినట్లే. కల నిజం కాబోతోంది.

* * *

రేడియోలో వాతావరణం చెబుతున్నాడు.

'రాబోయే యిరవై నాలుగ్గంటలకూ వాతావరణ సూచన ... కోస్తా జిల్లాలకు కుంభవృష్టి ... విశాఖపట్టణానికి వంద కిలో మీటర్ల దూరాన కేంద్రీకరించి వున్న తుపాను కోస్తా జిల్లాలకు వ్యాపించే అవకాశం వుంది...ప్రచండమైన గాలులతో ...బెస్తవారికి హెచ్చరిక...

అనూరాధ వులిక్కి పడింది. కంగారుగా 'ఏం చేద్దామండీ?' భర్తనుద్దేశించి.

'పడుకుందాము'

'నాఖర్మ! మీ కర్థంకాదు నా బాధ'

'ఏమిటాకంగారు అనూ?'

'ఫలితానికొస్తున్న అరటిచెట్టు పడిపోతుందండీ. ఎలా?'

'ఆవళ్ళు మనకు దక్కేయోగముంటే పడిపోదు.'

'అంతేనా?' బాధగా అనూరాధ.

అర్థరాత్రి. అనూరాధకు కునుకుపట్టలేదు. భర్త ముసుగుతన్ని నిద్రపోతున్నాడు.

వర్షం తీవ్రతహెచ్చింది. హోరుగాలి భయంకరంగావుంది. ప్రకృతి విజృంభించింది. ఆకాశాన్ని మెరుపులు చీలుస్తున్నాయి. ఉరుములు బిద్దలుకొడుతున్నాయి. కొండలు మొండెత్తి నిలుచున్నాయి. చెట్లు విరగబడిపోతున్నవి. ఇదంతా బయటసందడి.

అనూరాధ ప్రశాంతంగావుంది. కర్తవ్యం ఏమిటో ముందే తెలిసినదానిలా చూస్తూ కూర్చుంది. కిటికీతీసి టార్చిలైటువేసి చూసింది. పోటీ పెట్టిన కర్రపడిపోయింది.



చెట్టు బాగా వొంగిపోయింది!

వానజల్లు విసిరికొట్టడంతో పక్కంతా తడిసిపోయి ఉలిక్కిపడి లేచాడు మాధవరావు.

'అనూ! ఏమిటా ఛాదస్తం? ఆ కిటికీ మూసెయ్' తిరిగి నిద్ర కుపక్రమించాడు.

దభాలున కిటికీ దానంతటదే మూసు కుంది.

అనూరాధ మెల్లగాలేచింది. భర్త ను లేపినా లేవడు. తన బాధ అర్థంకాదు. అరటిచెట్టుపడిపోగూడదు. అది పడిపోతే తమూపడిపోతుంది.

అనూరాధ పెరట్లోకి నడిచింది. గాలి విసరికొడుతోంది. మెల్లగా, తూలుతూ అరటిచెట్టువద్దకు చేరింది. పడిపోతున్న అరటిచెట్టుని వాటేసుకుంది. పెళ్ళున కొరడాతో కొట్టినట్లు వురిమింది. పట్టు తప్పి అనూరాధ అంతదూరంలో పడి పోయింది. నిలబడే శక్తి లేదు. భయంకరంగా బుసకొడుతున్న గాలి మనిషినే ఎగరవేసే ట్లుగావుంది. అనూరాధ మోకాళ్లతో ప్రాకుతుంటూ చెట్టువద్దకుచేరింది. వంగి వున్న చెట్టుని గట్టిగా పట్టుకుంది. ఈసారి పట్టు విడవటం అనేదిలేదు. ప్రకృతితో పెనుగులాడింది. అనూరాధకు రాక్షసిబలంవచ్చింది. గాలికి అరటిచెట్టు వూగిపోతోంది అటూఇటూ. అరటిచెట్టుతో కలిసి అనూరాధకూడా.

చివరికి ప్రకృతి పశుబలమే నెగ్గింది. అరటిచెట్టు పడిపోయింది. అనూరాధ మాత్రం పట్టువిడువలేదు. స్పృహతప్పి పోయినా పట్టు వదల్లేదు.

మాధవరావు వులిక్కిపడి లేచాడు. అనూ ప్రక్కన లేకపోవడంతో కంగారుపడ్డాడు. దిగ్గున పెరట్లోకి వచ్చాడు.

'చూడు నా శక్తి' అన్నట్లుగా ఒక్క మెరుపు మెరిసింది. పడిపోయిన అరటి చెట్టు క్రింద అనూరాధ తడిసి ముద్దయి పోయింది. బిగుసుకు పోయింది.

* * *

'మిస్టర్ మాధరావ్! మీ భార్యకే ప్రమాదమూలేదు. నెలతప్పిన మనిషి కావడం వల్ల కొంచెం కంగారు పెట్టింది.' డాక్టర్ నవ్వుతూ.

'ఆఁ!' మాధవరావు మూర్ఛపోయినంత పని చేశాడు. అనూ చిరునవ్వు చిందిం చింది. ●